# బాలమిత్ర



## పక్షులు, బాలల అనుభవాలు

# పక్షులు, బాలల అనుభవాలు

బాలమిత్ర

ప్రచురణ :
**సమత - ధాత్రి** (మహిళలు, పిల్లల కోసం పనిచేస్తున్న వనరుల కేంద్రం)
ఏప్రిల్ 2010

సహకారం : **టాటా సోషల్ వెల్ఫేర్ ట్రస్టు,** ముంబయి

**కృతజ్ఞతలు :**
ఈ పుస్తకం తీసుకురావడంలో సహకరించిన బాలమిత్ర టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులకు కృతజ్ఞతలు. రిసోర్సు పర్సన్ గానే కాకుండా అనువాదం, పుస్తకాన్ని తీర్చిదిద్దడంలో కృషి చేసిన కె. ప్రభావతి గారికి జ్యోత్స్న మందన గారికి కృతజ్ఞతలు. కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములై కృషి చేసిన సంజీవిని, ఆదివాసీ మిత్ర, టెర్డ్స్, వెలుగు సంస్థలకు కృతజ్ఞతలు. ఆదివాసీ బాలల వికాసానికి ఇతోధికంగా దోహదపడిన ఈ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించిన టాటా సోషల్ వెల్ఫేర్ ట్రస్టు, ముంబయి వారికి కృతజ్ఞతలు.

# పక్షులు, బాలల అనుభవాలు

## పరిచయం:

మన దేశ తూర్పు కనుమలలో నివశిస్తున్న ఆదివాసులు ఆచరిస్తున్న పద్ధతులు, రకరకాల సాంప్రదాయాలు, సంస్కృతి, తరతరాలు నుంచి వస్తున్నది. అయితే ప్రస్తుత ఆర్థిక, సామాజిక మార్పులు, మారుతున్న జీవన విధానాల ప్రభావం వలన ఆదివాసుల సంస్కృతి రానురాను అంతరించి పోతుంది. ప్రస్తుత విద్యా విధానంలో ఇమిడి ఉన్న ఈ తరం గిరిజనులు వారి సంస్కృతి, సాంప్రదాయాల వెనుక ఉన్న అమోఘమైన విజ్ఞానాన్ని గుర్తించలేకపోతున్నారు.

ధాత్రి రిసోర్స్ సెంటరు బాలమిత్ర బడులు "సమత" సేవా సంస్థ యొక్క ఆదివాసి విద్యాకార్యక్రమం. ఇది ఆదివాసి సంస్కృతి, సాంప్రదాయ పద్ధతులలోని శాస్త్రీయ పరిజ్ఞానాన్ని, విద్య ద్వారా పటిష్టం చేయుటకు స్థాపించబడినది. మేము సాంప్రదాయ ఆచారాలు, చారిత్రాత్మక సంస్కృతి, శాస్త్రీయ విజ్ఞానాలలో ఏవైతే నశించిపోతున్నాయని అనుకుంటున్నామో వాటిని తరువాత తరాల వారికి అందించాలనే ఉద్దేశ్యంతో ఆదివాసి బాలలు, యువత, పెద్దవారు, వారి పద్ధతులపై పరిశోధన చేస్తూ సేకరించిన విషయాలను పొందుపరుస్తున్నాము. ఆదివాసి బాలలకు సంబంధించిన సాహిత్యాన్ని అభివృద్ధి పరిచాము, దీనిని అందరికి అందజేయగలిగితే ఆదివాసి బాలలే కాకుండా బయట ప్రపంచ బాలలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని మేము ఆశిస్తున్నాము.

ప్రకృతిని గమనిస్తూ, దాని నుండి నిరంతరం నైపుణ్యంతో కూడిన పాఠాలను నేర్చుకోవడం ఆదివాసుల జీవన విధానం. జంతువులను, చెట్లను గమనించడం, ప్రకృతిని కాపాడటంలో వాటిపాత్ర, వాతావరణంలో ఉన్న వివిధ ప్రాణులకు, ఆదివాసీలకు సంబంధాలను

నిరంతరం గమనిస్తూ జీవించడం అనేది వారి తరతరాలు నుండి వస్తున్న విద్య. ఈ విద్యను పెద్దవారి నుండి ఆదివాసీ బాలలు నేర్చుకుంటున్నారు. ఆదివాసి బాలల జీవితాలలో పక్షులు చాలా ప్రధానమైనవి. ఎందుకంటే పక్షుల వేట అనేది వారికి ప్రతిరోజు చాలా అనందాన్ని, సాహసాన్ని ఇచ్చే వ్యాపకం. ప్రతి రోజు పశువులను మేపుటకు అడవికి వెళ్ళే సమయంలో ఈ వేటను చేసి ఆనందిస్తారు. ఇంకా పెద్దవారితో అడవికి దుంపలు, పిక్కలు, ఆకులు మొదలైన వాటిని తెచ్చుటకు వెళ్ళినప్పుడు కూడా ఈ పక్షులను పట్టుకుంటారు. పండుగల సమయంలో అయితే కొంత మంది పిల్లలు గుంపుగా అడవికి వెళ్ళి ఈ వేటతో ఆనందిస్తారు. వీరు నిరంతరం ఈ పక్షులు జీవన విధానం, ఆహారపు అలవాట్లు, గూడులు కట్టడం, గుడ్లు, పిల్లలు పెట్టడం, కాలానుగుణంగా మారే మార్పులు, అవి ఎగిరే విధానాలను గమనిస్తూ ఉంటారు, ఒక విధంగా చెప్పాలంటే ఈ బాలలు పక్షుల వేటలో చాలా నిష్ణాతులు. చాలా సహజంగా సామాన్యశాస్త్రానికి సంబంధించి దాన్ని ఆదివాసి పిల్లలు పొందుచున్నారు.

విశాఖపట్నం జిల్లాలో గిరిజన ప్రాంతాలలో కనిపించే కొన్ని పక్షులకు సంబంధించిన వివరములతో కూడిన “బాలమిత్ర బర్డ్ సిరీస్” ను మొదటసారిగా మీ ముందుకు తీసుకువస్తున్నాము. ఈ పుస్తకంలో పొందుపరిచిన సమాచారం అంతా విద్యార్ధులు సేకరించినవే. వేటలో వారు అనుసరించే పద్దతులు, సొంత అనుభవంతో తయారు చేసుకున్న పుస్తకాల నుండి సేకరించడమైనది.

# పక్షులు, బాలల అనుభవాలు

టీచర్ : పిల్లులూ! బాగున్నారా? శెలవులకు మీ ఊరు వెళ్ళినప్పుడు అక్కడ ఏమేమి చూసారో? ఏమి చేసారో? ఏం తిన్నారో నాకు కూడా చెబుతారా?

వెంకట్ : శెలవుల్లో మా ఊర్లలో చాలా సరదాగా గడిపాము టీచర్. అక్కడ మా స్నేహితులతో కలిసి చాలాచాలా ఆటలాడాము, పాటలు పాడేము, డాన్స్ చేసాము టీచర్.

గిరి : టీచర్! టీచర్ మేము మా అమ్మ నాన్నలతో పొలంకి వెళ్ళి జొన్న కాయలు కాల్చుకొని తిన్నాము టీచర్! చాలా బాగున్నాయి.

పులిచెరి : టీచర్! నేను మా ఊరి వారితో "బొడ్డంగలు" ఈతపురుగుల వేటకు వెళ్ళి కూర వండుకొని తిన్నాం, మీకు కూడా వచ్చే శెలవులకు వెళ్ళినప్పుడు తెస్తాను టీచర్!

టీచర్ : ధ్యాంక్స్! పులిచెరి.

శ్రీను : టీచర్! మేము అడవికి పిట్టల వేటకు కూడా వెళ్లాము. అక్కడ జంతువులు, పక్షులు చాలా చాలా చూశాము.

టీచర్ : ఔనా! మరి ఈ రోజు మనం, మీరు చూసిన పక్షులు గురించి తెలుసుకుందామా?

లలిత : ఔను టీచర్! అందరూ అన్ని పక్షుల గురించి మాట్లాడుకుంటే అందరికి అన్ని జాతుల పక్షుల గురించి తెలుస్తుంది.

టీచర్ : మన లలిత చెప్పింది చాలా బాగుంది. మరి ముందు మనం ఏఏ పక్షులు గురించి మాట్లాడుకుందాం?

పులిచెరి : టీచర్! టీచర్ ముందు మా ఇంట్లో పెంచుతున్న పక్షులు గురించి చెబుతాను టీచర్.

టీచర్ : సరే ఇప్పుడు మన పులిచెరి ఇంట్లో వాళ్ళ బుడ్డి పెంచుతున్న పక్షులు గురించి తెలుసుకుందాం.

పులిచెరి : (ఇంట్లో పెంచుతున్న పక్షులు గురించి చెబుతుంది)

# కోడిపెట్ట



బూడిద, మట్టి, తెలుపు, నలుపు, కాషాయి, రంగుల్లో ఉంటుంది. గూడు కట్టుకోదు. పెంపుడు పక్షి కాబట్టి ఇండ్ల వద్ద తట్ట, బుట్ట, కొల్లాంతో మూస్తారు. మరియు ప్రత్యేకమైన కోళ్ళగూడులను నిర్మిస్తారు.

గ్రుడ్లు **12** నుంచి **24** వరకు సంవత్సరానికి **2** సార్లు గ్రుడ్లు పెడుతుంది. **21** రోజులలో గ్రుడ్లను పొదిగి పిల్లలను చేస్తుంది. ఈ గ్రుడ్లను పొదిగే సమయంలో మూడు లేక నాల్గు రోజులకు ఒక సారి మాత్రమే ఆహారము తీసుకుంటుంది.

ఇది పెంపుడు పక్షి కాబట్టి ఇండ్ల వద్ద గ్రుడ్లను పొదిగించుటకు ప్రత్యేకమైన పట్టు (గూడు) కడతారు. ఈ పట్టు ఇసుక కాని ధాన్యపుపొట్టు గాని తట్ట లేక బుట్టలో వేసి తాళ్ళతో పంచకు కడతారు. చెదలు, పురుగులు, గింజలు, అన్నం, మాంసం, చేపలు, కొవ్వురాళ్ళు తింటుంది.  **5** నుంచి **8** సంవత్సరాలు బ్రతుకుతుంది.



## కోడిపుంజు

ఎరుపు, ఆకుపచ్చ, పసుపు, బూడిద, మట్టి, తెలుపు, నలుపు, కాషాయి మెరుపుతో కూడిన రంగుల కలయికతో పొడవైన తోకతో, గెడ్డం, జుత్తు ఎరుపు రంగులో ఉండి బలమైనకాళ్ళు కలిగి ఉంటాయి. కోక్కోరోక్కో... అని అరుస్తుంది.

గూడు కట్టుకోదు. పెంపుడు పక్షి కాబట్టి ఇండ్ల వద్ద తట్ట, బుట్ట, కొల్లాంతో మూస్తారు. మరియు ప్రత్యేకమైన కోళ్ళగూడులను నిర్మిస్తారు.

చెదలు, పురుగులు, గింజలు, అన్నం, మాంసం, చేపలు, కొవ్వురాళ్ళు తింటుంది. 5 నుంచి 8 సంవత్సరాలు బ్రతుకుతాయి. ఈ పక్షులను పెంచి మా బుడ్డి సంతలో అమ్మి మాకు జుగిడీలు కొంటుంది.

చుట్టాలు వచ్చినప్పుడు కోడికోసి కూర వండిపెడుతుంది. ప్రస్తుతం కోడి పుంజులతో పందెంలు కూడా ఆడుతున్నారు.



# బాతు

మట్టి, బూడిద, నలుపు, తెలుపు రంగుల్లో ఉంటుంది. ముక్కు వెడల్పుగా, పొడవుగా ఉంటుంది. ఎక్కువగా నీటిలో ఉంటుంది. కాళ్ళు పొట్టిగా ఉండి ఈదుటకు అనువుగా ఉంటాయి.

ఈ పక్షి గూడు కట్టుకోదు. పెంపుడు పక్షి కాబట్టి ఇండ్ల వద్ద తట్ట, బుట్ట, కొల్లాంతో మూస్తారు. మరియు ప్రత్యేకమైన గూడులను నిర్మిస్తారు.

సంవత్సరంలో 5 నుండి 6 విడతలు ఒక్కొక విడతకి సుమారుగా 10 - 20 గ్రుడ్లు పెడుతుంది. చేపలు, పురుగులు, వానపాములు, నీటి పురుగులు, గింజలు, గడ్డి కూడ తింటుంది.

టీచర్ : ఈ బాతుకి ఒక ప్రత్యేకత ఉంది. మీకు తెలుసా?

పిల్లలు : తెలియదు టీచర్!

టీచర్ : దీని వెంట్రుకలు నూనె గ్రంథులు కలిగి ఉండడం వలన నీటిలో మునిగిన కూడ తడవదు. మరియు ఇది గ్రుడ్లను పొదిగి పిల్లలను చేయదు. దీని గ్రుడ్లను కోడిపెట్ట వద్దపెట్టి పొదిగిస్తారు. ఈ పక్షులను పెంచి వాటి గుడ్లు, మాంసం కూడ అమ్ముతారు. చుట్టాలు వచ్చినప్పుడు బాతు కూరతో కూడ మర్యాదలు చేస్తారు.

పులిచెరి : టీచర్ నేనిప్పుడు గోరింకపిట్ట, చిలుక గురించి కూడా చెబుతాను.

టీచర్ : అలాగే చెప్పమ్మ!

పులిచెరి : (గోరింక పక్షి, మరియు చిలుక గురించి చెబుతుంది)

# గోరింక పిట్ట

## దీనిని మైనా, గొరపిట్ట అని కూడా పిలుస్తారు



గోరింకపిట్టలు అన్నిచోట్లా కనిపిస్తాయి. ఈ పక్షి ఈతచెట్టు కొమ్మలలోను, కొబ్బరికొమ్మ దగ్గర, చింతచెట్టు తొర్రల దగ్గర గూడు కట్టుకొని ఉంటాయి.

కనీసం మూడు లేదా రెండు గ్రుడ్లు మాత్రమే పెడుతుంది. 30 నుంచి 38 రోజుల లోపల పిల్లలు పూర్తిగా రెక్కలు వచ్చి ఎగిరిపోతాయి. వాటి ఆహారం చిన్న బొంబితులు, పురుగులు, గడ్డి కీటకాలు తిని బ్రతుకుతాయి. ఎక్కువగా పెంటకుప్పలు దగ్గరకు వచ్చి ఆహారాన్ని తీసుకుంటాయి. మచ్చిక చేసి ఏ బాష నేర్పిన నేర్చుకుంటాయి.

ఈ పక్షి మట్టి, నలుపు రంగులలో ఉంటుంది. కాళ్ళు, ముక్కు పసుపు రంగులో ఉండి, కళ్ళు మాత్రం ఎరుపుగా ఉంటాయి. గోరింకపిట్టలు చాలా రకాలుగా అరుస్తాయి.

# చిలుక

ఈ పక్షి లేతాకుపచ్చ రంగులో ఉంటుంది. ముక్కు, కళ్ళు, మెడ ఎరుపు రంగులో ఉంటాయి. చెట్టు తొర్రల్లో గూడు కడుతుంది. 3 నుంచి 4 గ్రుడ్లు పెడుతుంది.

21 రోజుల్లో పేల్చి పిల్లలను పెడుతుంది. ఇది శాఖాహారి. గింజలు, పండ్లు, కాయలు ఇష్టంగా తింటుంది. 40 నుంచి 80 సంవత్సరాలు బ్రతుకుతుందని మా బుడ్డి చెప్పింది.

ఇది అందమైన పక్షి ఇండ్ల దగ్గర పెంచుకుంటారు. మాటలు నేర్పితే మాట్లాడగలదు. కోయదొరలు ఈ పక్షులతో జ్యోతిష్యం చెప్పించి డబ్బులు కూడా తీసుకుంటారు.





వెంకట్ : టీచర్ నాకు చిలుకపై ఒక కథ కూడా తెలుసు, చెప్పనా?

టీచర్ : చెప్పు చెప్పు వెంకట్.

వెంకట్ : (చిలుక - వేటగాడు కథ చెబుతాడు)

అనగనగా ఒక పెద్ద అడవిలో ఒక చెట్టు తొర్రలో ఒక చిలుక నివశించేది. అది గ్రుడ్లు పెట్టింది. ఇందతా మరో చెట్టుపై నుండి వేటగాడు గమనిస్తుండేవాడు. కొన్ని రోజులకు చిలుక గూడు నుండి చీఫ్ చీఫ్ అని శబ్దం వచ్చింది. వేటగాడు అది విని, ఈ రోజు నాకు భలే అదృష్టం కలిగింది. చిలుక గ్రుడ్లు పొదిగి పిల్లలు చేసింది అనుకున్నాడు.

చీప్..... చీప్ మని చిలుక పిల్లలు అరుస్తుంటే తల్లి చిలుక, "నిశ్శబ్దంగా ఉండండి" అరవవద్దు నేను వెళ్ళి త్వరగా మీకు ఆహారం తీసుకువస్తానని అక్కడ నుండి ఎగిరి వెళ్ళింది.

చిలుక ఎగిరి వెళ్ళిన వెంటనే పొంచివున్న వేటగాడు చెట్టు ఎక్కాడు. చిలుక గూడులో చెయ్యిపెట్టి పిల్లల్ని తియ్యబోతుంటే చిలుక పిల్లలు చీప్..చీప్ మని భయంతో అరవసాగాయి. ఇంతలో తల్లి చిలుక ఆహారంతో వచ్చింది. వేటగాడు తన పిల్లలను

తీస్తుండడం చూసి ఎందుకు నా చిన్న పిల్లల్ని తీస్తున్నావు. వదిలేయ్, వదిలేయ్ అని ఏడుస్తూ పాపం ఆ వేటగాడి చూట్టూ తిరిగింది. ఎక్కడ నీకు పక్షులే దొరక లేదా? నా చిన్న పిల్లలు ఇంకా కళ్ళే తెరవలేదు. ఎందుకు వాటికి హాని చేయాలనికుంటున్నావని ఏడుస్తూ అడిగింది తల్లి చిలుక "ఎందుకు అలా భయపడి పోతున్నావు. నేను చంపడానికి తీసుకెళ్ళడం లేదు. ఇళ్ళ వద్ద పెంచుకొనే వారికి అమ్మడానికి తీసుకు వెళుతున్నాను. నన్ను నమ్ము, నేను నీ పిల్లలను ఏమి చేయను" అన్నాడు. వేటగాడు "కానీ ఇప్పుడు కాదు, కొంతకాలం తరువాత పెద్దయ్యాక తీసుకు వెల్లువుగానిలే" అంది తల్లి చిలుక. తల్లి చిలుక ఆలోచించి, ఇతనికి జాలి కూడా లేదు అందునా నాతో అబద్దాలు చెబుతున్నాడు, ఇతనికి తగిన గుణపాఠం చెప్పాలనుకుంది.

"నీకు డబ్బే కదా కావాలి నా పిల్లల్ని వదిలేయ్ నీకు కావలసినంత డబ్బు ఇస్తాను" అంది తల్లి చిలుక "ఎక్కడ నుండి తెచ్చిస్తావు?" అన్నాడు వేటగాడు నేను మొన్నే చూసాను. ఒక గొప్ప ధనవంతుడు దొంగలకు భయపడి తన సంపద అంతా అడవిలో దాచాడు. నా చిన్న పిల్లల్ని వదిలిస్తే ఆ సంపద నీకు చూపిస్తాను "అన్నది తల్లి చిలుక. వేటగాడు ఆశపడి చాలా సంతోషంతో చిలుక పిల్లల్ని వదిలేసి" పద చూపించు ఆ బంగారం, డబ్బు ఎక్కడ ఉందో అన్నాడు సరే పదా అని ఒక పెద్దపుట్ట వద్దకు తీసుకెళ్ళి "అదిగో అందులో చెయ్యిపెట్టి తీసుకో" అంది చిలుక. వెంటనే

వేటగాడు ఆశగా చెయ్యిపెట్టాడు అంతే పాము కాటేసి అక్కడకక్కడే చనిపోయాడు. పాపం వేటగాడు చనిపోయాడు. కానీ ఏమి చేయను అదొక్కటే మార్గమనిపించింది. నా పిల్లల్ని కాపాడుకోవడానికి అనుకుంది చిలుక.

టీచర్ : చాలా బాగా చెప్పావ్ వెంకట్.

రేఖా : టీచర్! మరి నేను మా ఊరు, ఇళ్ల చుట్టూ (దగ్గర) కూడా కొన్ని పక్షుల్ని చూసాను. మరి ఆ పక్షులు గురించి నేను చెప్పనా టీచర్!

టీచర్ : తప్పకుండా చెప్పమ్మా! పిల్లలూ! ఇప్పటి వరకు పులిచెరి ఇంటి దగ్గర పెంచుకొనే పక్షులు గురించి చెప్పింది. వెంకట్ చిలుక కథ చెప్పాడు. మరీ ఇప్పుడు రేఖా ఇంటి పరిసరాల్లో కన్పించే పక్షులు గురించి చెప్తుంది. విందామా మరి.

పిల్లలు : విందాం టీచర్!

రేఖ : (పావురాలు, పిచ్చుకలు, కాకులు గురించి చెబుతుంది)

# పావురాలు

బూడిద, తెలుపు, మట్టి రంగులలో ఉంటాయి. కాళ్ళు, ముక్కు, కళ్ళు ఎరుపు రంగులో ఉంటాయి. ఇవి అడవిలోను, గ్రామాలలోను, దేవాలయాలలోను ఎక్కువగా కనిపిస్తాయి. కొంత మంది ఇండ్ల దగ్గర పెంచుకుంటారు. ఇవి చెట్టుతొర్రల్లో, గుహల్లో, చిన్నచిన్న కిటికీలపై గూడు కట్టుకుంటాయి. మూడు నెలలకు ఒకసారి రెండు గ్రుడ్లు పెట్టి పొదుగుతుంది. ఇది గింజధాన్యాలు ఇష్టంగా తింటుంది. మరియు చిన్నచిన్న పురుగులను కూడ తింటుంది.





# పిచ్చుక

మట్టి, బూడిద, గోధుమ చిన్నచిన్న నలుపు రంగుల్లో ఉంటుంది. ఇది సాదారణంగా గ్రామాల్లో జీవిస్తాయి. దీని గుడ్లు ఇండ్ల చూరుల్లో, పంచల్లో, ఎత్తైన కిటికిలపైనా, మరియు ధాన్యపు గాదిలపై చిన్నచిన్న గడ్డి, కోడి చిన్న వెంట్రుకలతో మెత్తటి గూడు కడుతుంది. సంవత్సరానికి రెండు నుండి మూడు గుడ్లు పెట్టి 10 నుండి 15 రోజులల్లో పొదిగి పిల్లలను చేస్తుంది.

ఆహారం గంటి, కొర్ర, సామ, ధాన్యం, చోళ్ళు మొదలైన గింజలను మరియు చిన్నచిన్న కీటకాలు తింటుంది. ఈ పక్షులు ఆడ మగ కలిసి పిల్లలను పెంచుతాయి. పండిన మొదటి పంట వెన్నులతో కట్టకట్టి తీసుకువచ్చి ఇండ్ల పంచల దగ్గర, గుడిల్లోను పిచ్చుకలకు ఆహారంగా వేలాడ తీస్తారు. పిచ్చుకలు ఇంటి దగ్గర ఉంటే డబ్బులు ఎక్కువగా ఉంటాయని మా ఊరు వారు అంటుంటారు.

సామెత : "పనివాడు పందిరేస్తే పంచపిచ్చుకలొచ్చి పడగొట్టాయంట" ఎవరైనా కష్టపడకుండా, మనసు పెట్టకుండా పని చేస్తే మా బుడ్డి ఈ సామెత చెబుతుంది.

పాట : చిన్నపక్షి కిటికిపైన గూడు ఒకటి కట్టుకుంటుంది
చిన్నచిన్న గడ్డి చిన్నచిన్న పరక తీసివేసి కట్టుకుంటుంది.



# కాకి

ఈ పక్షి నలుపు, బూడిద రంగుల కలయికలతో ఉంటుంది. గ్రామాలు, అడవి, పంటపొలాల్లో కూడ కనిపిస్తాయి. చెట్లుకొమ్మల్లో చిన్నచిన్న పుల్లలతో గూడు కడుతుంది. 5 నుండి 6 గ్రుడ్లు పెడుతుంది.

దీని ఆహారం గింజలు, పప్పులు, చేపలు, మాంసం, కప్పలు, ఎలుకలు, కోడిపిల్లలు, ఇండ్ల దగ్గర అన్నం మొదలగునవి అన్ని తింటుంది. సుమారుగా 15 సంవత్సరాలు బ్రతుకుతుంది. ఇది ఎక్కువగా ఇండ్ల దగ్గర ఉండడం వల్ల మనుషులు తినే ఆహారాలన్ని తింటుంది.

కాకి అరుపు వినగానే చుట్టాలు వస్తారని అంటారు. కాకులు చనిపోయినవారి అత్మలుగా భావించి కొంత మంది మొదటి అన్నం వాటికి పెడతారు.

గిరి : టీచర్ ! నాకు కాకికి నల్లరంగు ఎలా వచ్చిందో కథ కూడా తెలుసు. మా బుడ్డి చెప్పింది.

టీచర్ : అయితే ఇంకేం, చెప్పు అందరం వింటాము.

గిరి : (కథ చెబుతాడు) కాకి రంగు కథ

పూర్వం ఒక గ్రామంలో ఒక గిరిజన రైతు తన పొలంలో జొన్న పంట వేసాడు. ఆ చేను పంటకాలం రానే వచ్చింది. ఇక కాకులకు పండగే పండగ. ఎందుకంటే అప్పుడే లేతగా పండిన గింజలు కడుపునిండా తిని చేను పాడుచేసేవి.

ఇది గమనించిన ఆ రైతు తన భార్యతో ఈ విషయం చెప్పగా.... ఆమె ఒక నల్లని చిన్న చట్టి (కుండపెంకు) ఇచ్చి, చేను మధ్యలో ఒక పెద్ద కర్రపెట్టి దానిపై ఈ చట్టిపెడితే, దాన్ని చూసి కాకులు భయపడి చేను దగ్గరకు రాకుండా ఉంటాయని చెప్పింది. ఆ రైతు తన భార్య చెప్పిన విధంగా చేసాడు.

కాకులు మొదట ఆ చేనులో నల్లగా ఉన్న ఆకారాన్ని చూసి భయపడి చేనుకు దూరంగా వెళ్ళిపోయాయి. కానీ అందులో ఒక కాకి మాత్రం చూసి చూసి ధైర్యం చేసుకొని ఆ చట్టి దిష్టిబొమ్మ దగ్గరగా వెళ్ళింది. కానీ అది కదల లేదు.

తరువాత ఆ చట్టి దిష్టబొమ్మపై వాలింది. కానీ అది ఏమి చేయలేదని గమనించి, రోజు వెళ్ళి దానిపై వాలి ఆడుకొనేది. దానిని చూసి మిగిలిన కాకులన్నీ కూడా వెళ్ళి ఆ నల్లని చట్టి దిష్టిబొమ్మపై వాలాయి. అంతే అన్ని కాకులకు ఆ చట్టిలా నల్లరంగు వచ్చేసిందట అప్పటి నుండి కాకులన్నీ నల్లగా ఉన్నాయంట.

పిల్లలు : హ....హ....హ బలేబలే బాగుంది కధ.

గిరి : ఇంకా మా డొకిరి కాకి మీద సామెతలు చెప్పింది.

సామెతలు:

1. కాకి పిల్ల కాకికి ముద్దు

2. కాకి ముక్కుకి దొండ పండు

3. కాకిలా కడల్లా బ్రతికే కన్న హంసలా ఆరునెలలు బ్రతికితే చాలు

టీచర్ : చాలా బాగా చెప్పావు గిరి! మరి మీరు ఇంటికి వెళ్ళినప్పుడు గెడ్డకు, చెరువుకు, నదికి వెళ్ళి చేపలు, పీతలు వేటాడేటప్పుడు, స్నానం చేసేటప్పుడు, అరటిడొంగ ఆడేటప్పుడు అక్కడ ఏవైనా పక్షుల్ని చూసారా?

డొంబు : ఔను టీచర్! నేను అక్కడ నా స్నేహితులతో పీతల వేటకి వెళ్ళినప్పుడు చాలా రకాల పక్షుల్ని చూసాను. వాటి గురించి నా స్నేహితులు నాకు బాగా చెప్పారు. నేను చెప్పనా టీచర్.

టీచర్ : ఓ తప్పకుండా! పిల్లలూ! ఇప్పుడు డొంబు మనకు "నీళ్ళ పరిసరాలు"లో కన్పించే పక్షులు గురించి చెబుతాడు. జాగ్రత్తగా వినండి సరేనా?

పిల్లలు : అలాగే టీచర్.

డొంబు : (నీళ్ళు పరిసరాలలో కన్పించే పక్షుల గురించి చెబుతాడు)

# నీరు కోడి

దీని రంగు నల్లగా ఉంటుంది. నీటిలోను బయట కూడా తిరుగుతుంది. మూడు నెలలకు ఒకసారి గ్రుడ్లు పెడుతుంది. ఇది చేపలు, కప్పలు, పురుగులు తింటుంది.





# చేపల జొండి

ఈ పక్షి నీలం. ఆకుపచ్చ రంగులో ఉంటుంది. పొట్టితోక ఉంటుంది. ఈ పక్షి అన్ని చోట్లా కన్పిస్తుంది. పై నుండి నీటిలో చేపలను చూసిన వెంటనే చాక చక్యంగా పట్టుకొన గలదు. దీని ఆహారం చేపలు, కప్పలు, నీళ్ళలో ఉండే పురుగులు కూడా తింటుంది.

ఈ పక్షి మార్చి - జూన్ నెలల్లో 5 నుండి 7 గ్రుడ్లు పెడుతుంది. ఆడ, మగ పక్షులు రెండు బాధ్యతతో పిల్లల్ని పెంచుతాయి.



# ఎడారి పక్షి


ఈ పక్షి చిన్న రాళ్లను కుప్పగా చేసి దాన్ని వృత్తాకారంలో (గుండ్రంగా) పేర్చి మధ్యలో గుడ్లు పెడుతుంది. ఈ పక్షి నాలుగు గ్రుడ్లను పెడుతుంది. దీని గ్రుడ్లు తెల్లగా, మచ్చలుగా ఉంటాయి. ఇది 30 నుంచి 45 రోజులలో పొదుగుతుంది. ఇది కీటకాలు, పురుగులు, ఆకులు, గడ్డి తింటుంది. దీని అరుపు తేవోయ్, తేవోయ్ అని అరుస్తుంది. ఈ పక్షి రంగు బూడిద, మట్టి, తెలుపు రంగుల కలయికతో ఉంటుంది.

# తీతువు పిట్ట

ఈ పక్షి తెలుపు, నలుపు, పసుపు రంగుల కలయికతో ఉంటుంది. కాళ్ళు, ముక్కు పసుపు రంగుల్లో ఉంటాయి. కాళ్ళు సన్నగా పొడవుగా ఉంటాయి. ఇది ఎక్కువగా రాత్రిళ్ళు సంచరిస్తూ ఉంటుంది. గెడ్డలు, ఏటి పరిసర ప్రాంతాలు మరియు గ్రామ పరిసరాలలో ఎక్కువగా సంచరిస్తుంది.

ఈ పక్షి గ్రామంపై నుండి రాత్రి సమయంలో అరుస్తూ ఎగిరి వెళితే ఆ గ్రామంలో ఎవరో ఒకరు చనిపోతారని అంటారు, దీని ఆహారం, చేపలు, పురుగులు మొదలైనవి.

కాళ్ళుపైకి పెట్టి వెళ్ళకిల పడుకుంటుంది. కారణం ఏంటంటే, నిద్ర పోయినప్పుడు ఆకాశం తనపై పడిపోతుందేమోనని, పడిపోతే తన కాళ్ళతో ఆకాశాన్ని తనపై పడకుండా ఆపి వేయడానికి అలా పడుకుంటుందని మా ఊరు వారు కథలు కథలుగా చెప్పుకుంటారు.



## కొంగ

తెలుపు, మట్టి, పసుపు రంగుల కలయికతో ఉంటాయి. పసుపు రంగుతో కూడిన పొడవైన ముక్కు, కాళ్ళు, కలిగి ఉంటాయి. ఈ పక్షి ఎత్తైనచెట్లపై చిన్నచిన్న కర్రపుల్లలతో గూడు కడుతుంది. రెండు గ్రుడ్లను పెట్టి పొదుగుతుంది.

ఆహారం చేపలు, కప్పలు, కీటకాలు, చిన్నచిన్న పాములను తింటుంది. 10 నుంచి 12 సంవత్సరాలు బ్రతుకుతుంది. ఈ పక్షి ఎక్కువగా నీటిమడుగులు, గెడ్డలు, ఊటలు, పశువుల దగ్గర ఈగలను కూడా తింటుంది. మరియు దున్నేపొలాల దగ్గర పురుగులను తింటుంది. ఇది చాలా దూరం ఎగురుతుంది.

జగన్నాథం : నాకు “కొంగ చింతచెట్టు” కథ కూడా తెలుసు మేడమ్!

టీచర్ : సరే చెప్పు

జగన్నాథం : (కొంగ చింతచెట్టు కథ చెబుతాడు)

పూర్వం నుండి ఒక ఊరులో చింతచెట్లు ఎక్కువగా ఉండేవి. ఆ చింతచెట్లపై ప్రతిరోజు కొంగలు నివసిస్తూ ఉండేవి. కొంత కాలం గడిచింది ఒక కొంగ గర్భం ధరించింది. గుడ్లు ఎక్కడ పెట్టాలని గాభరాగా ఉండేది. అంతలో కొంగకు ఒక మంచి ఉపాయం వచ్చింది. నేను ఒక వడ్రంగి అన్న దగ్గరకు వెళ్ళి చెప్పినట్లయితే చింతచెట్టుకి కన్నము చేసి పెడతాడు అనుకున్నది. అక్కడ గుడ్లు పెట్టి పొదగవచ్చునని ఆలోచించింది.

కొంగ వడ్రంగి దగ్గరకు వెళ్ళింది. వడ్రంగికి నేను గర్భవతిగా ఉన్నాను అన్నది. గుడ్లు పెట్టి పొదగడానికి ఒక చింతచెట్టుకు కన్నము చేసిపెట్టి ఇవ్వమని కొంగ వడ్రంగిని అడిగింది.

వడ్రంగి వెళ్ళు వెళ్ళు నీకు నేను కన్నము చేసి ఇవ్వాలా! అని అన్నాడు. అక్కడ నుండి కంసాలి దగ్గరకు వెళ్ళింది. కంసాలి నేను గర్భంతో ఉన్నాను, నాకు చింతచెట్టుకు

కన్నుము చేసి ఇవ్వమని అడిగింది. అతను నేను చేయను పొమ్మన్నాడు. ఆవులకాపరి దగ్గరకు వెళ్ళింది. వడ్రంగి, కంసాలికి ఇద్దరికి చెప్పాను కాని నాకు గూడు చేసి ఇవ్వలేదు. నువ్వు వెళ్ళి వాళ్ళు ఇద్దరికి రెండు దెబ్బలు కొట్టు, అని కొంగ చెప్పింది. ఆ పని నేను చేయను పో, అన్నాడు ఆవుల కాపరి.

అప్పుడు కొంగ ఆవు దగ్గరకు వెళ్ళింది. ఆవు ఆవు కంసాలి, వడ్రంగి, నీ కాపరికి కూడా చెప్పాను కాని నాకు గూడు చేసి ఇవ్వలేదు. నీవు వెళ్ళి నీ కాపరిని తన్ను అన్నాది. నేను ఆ పని చేయలేను. అని ఆవు అన్నది. అక్కడ నుండి కొంగ ఆవు దూడ దగ్గరకు వెళ్ళి జరిగన కథ అంత చెప్పింది.

ఆవు దూడ తేనెపట్టు ఈగల దగ్గరకు వెళ్ళింది. నేస్తమా నాకు చాలా అవసరం వచ్చింది, సహాయం చేయమని కొంగ నా దగ్గరకు వచ్చింది. దానిని కాపాడమని జరిగిన విషయం అంతా వివరించింది. తేనెపట్టు నాకు కూడా ఎప్పుడైనా ఆపద రావచ్చు కాబట్టి మీ ఆపద తీరిస్తే, దేవుడు నా ఆపద కూడా ఎప్పుడైనా తీరుస్తాడు అనుకొని నువ్వు వెళ్ళు, నేను వస్తాను అని చెప్పి పంపించింది. తేనెపట్టు వెళ్ళి ఆవుదూడ తల్లిపాలు త్రాగుతున్నప్పుడు కన్పించింది. అది చూసి భయపడి తల్లి ఆవును కరిసింది. ఆవు ఆ కోపంతో వెళ్ళి కాపరిని పొడిచింది.

కాపరి ఆ కోపంతో వచ్చి కంసాలిని రెండు తాపులు తన్నాడు. కంసాలి వెళ్ళి వడ్రంగిని ఒక తన్ను తన్నాడు. వడ్రంగి వచ్చి కొంగకి చింతచెట్టుకి కన్నము పెట్టి ఇచ్చాడు. కొంగ వచ్చి గ్రుడ్లు పెట్టి, పిల్లలని పొదిగి హాయిగా ఉంది. తెలివిగా తన కష్టం తీర్చుకుంది కొంగ.

సామెత : చెర్లో చేపలు చెల్లిపోయాయి ఇంకేమి తింటవే నా గుడ్డికొంగ.

లైకోన్ : కొంగల్ని మేము వేటాడుతాం టీచర్!

టీచర్ : ఎలా వేటాడుతారో మాకు కూడా చెప్పు లైకోన్.

లైకోన్ : (కొంగ వేట) చిన్నచిన్న వెదురుపుల్లలకు దారం, కిత్తనారతో ఉరి తయారు చేసి కొంగలు తిరిగే దగ్గర ఉరి పుల్లలను నేలపై గుచ్చి అక్కడ చిన్నచిన్న చేపపిల్లలని, పురుగులని జల్లుతారు. వీటిని తినడానికి వచ్చిన కొంగలు ఉరితాళ్ళల్లో చిక్కుకొని ఎగరలేకపోతాయి. ఉరి వేసిన వారు వెళ్ళి ఆ కొంగలను పట్టుకుంటారు.

టీచర్ : అందరు చప్పట్లు కొట్టండి పిల్లలూ! లైకోన్ చాలా బాగా చెప్పాడు.

మరి ఇంకా ఎవరైనా ఏమైనా పక్షుల్ని చూసారా?

శంకర్ : ఔను టీచర్! మా స్నేహితులతో అడవికి పక్షుల వేటకి వెళ్ళినప్పుడు, మా అమ్మ, నాన్నలతో పొలంకి వెళ్ళినప్పుడు, చాలా రకాల పక్షుల్ని చూసాము.

టీచర్ : మరి ఆ పక్షుల గూర్చి పూర్తి వివరాలు తెలుసా?

శంకర్ : తెలుసు టీచర్, మా నాన్నని, మా తాతని కూడా అడిగి తెలుసుకున్నాను.

టీచర్ : అయితే ఇంకేం! మరి మన శంకర్ ఇప్పుడు అడవి, మన పొలాల్లో కన్పించే పక్షులు గురించి చెబుతాడు. అందరు విందామా?

పిల్లలూ : విందాం టీచర్!

శంకర్ : (అడవి, పొలాల్లో కన్పించే కొన్ని పక్షుల గురించి చెబుతాడు)



# గువ్వపిట్ట

బూడిద, మట్టి, తెలుపు రంగుల కలయికలలో ఉంటాయి. తుప్పలలోని, చెట్లపైన చిన్నచిన్న పుల్లముక్కలతో గూడు కడుతుంది. ఏప్రిల్, మే నెలల్లో 2 గ్రుడ్లను పెట్టి పొదుగుతుంది. వీటిని రామలక్ష్మణులని పిలుస్తారు.

చోళ్ళు, సామలు, ధాన్యం, గంటెలు, పప్పుధాన్యాలు, మిడతలు, పురుగులు మొదలైనవి తింటుంది. ఈ పక్షులు జంటజంటలుగా తిరుగుతాయి. ఎక్కువ దూరం ఎగరగలవు, నేలపై నడవగలవు.

## గువ్వపిట్ట పాట

గువ్వపిల్ల గువ్వపిల్ల   కిర్ ..... కిర్
కొక్కి మీద కంకి గింజ   టిక్ ..... టిక్
గోల గోల గువ్వపిల్ల   తూష్ ..... తూష్
ఎగిరిపోయి మళ్ళీవచ్చె   కిర్ ..... కిర్

టీచర్ : నీకు కూడా పక్షులు వేటాడడం తెలుసా మునిమా!


మునిమ : తెలుసు టీచర్.

టీచర్ : అయితే చెప్పు.

మునిమ : (అడవి కోళ్ళు, కారుకోళ్ళు, కొంచెం పెద్ద పక్షులను వేటాడే పద్ధతి)

దీర్ఘచతురస్రంలో ఉన్న ఒక పలకరాయి తీసుకొని పక్షులు కింద సంచరిస్తున్న ప్రాంతంలో ఏటవాలుగా నిలబెట్టి దానిని రాయింత పొడవుగల సన్నని కర్రపై ఆన్చి పెడతారు. రాయి కింద సన్నని దారం కట్టి దానిని ఆ కర్రకు కట్టి ఉంచాలి.

రాయి కింద దాని చుట్టూ గింజలు జల్లి ఉంచాలి. పక్షులు వచ్చి గింజలు తినేటప్పుడు వాటి కాళ్ళకు దారం తగిలి కర్ర కదిలినప్పుడు పలకరాయి పక్షిపై పడిపోతుంది. దూరం నుంచి చూస్తున్న పిల్లలు వచ్చి పక్షిని తీసుకుంటారు. ఇప్పుడు నేను గుడ్లగూబ, ఆకుపిట్ట, వంకాయబుడత, వడ్రంగిపిట్ట, ఆకుపిట్ట వేట గురించి కూడా చెబుతాను వినండి.



# అడవికోడి

ఈ కోడి ఊరులోని కోళ్ళు వలే వుంటుంది. అడవిలో ఉంటుంది. వీటి కాళ్ళు గోళ్ళు పదునైన కత్తుల వలే ఉంటాయి. ఇది చాలా దూరం వరకు ఎగర గలదు. చిన్నచిన్న పురుగులు, గింజలు వీటి ఆహారం. ఇది చిన్న చిన్న గుహల్లో 1 నుండి 10 గ్రుడ్లు పెడుతుంది. 21 రోజుల్లో పొదుగుతుంది.





## గుడ్లగూబ

మట్టి, బంగారం, బూడిద రంగుల కలయికతో ఉంటుంది గుండ్రని పెద్ద తల, ముఖం, కళ్ళు కలిగి ఉంటుంది. ఇది రాత్రి సమయంలో ఎలుకలు, కీటకాలు వేటాడి తింటుంది. పగలు నించొని నిద్రపోతుంది. ఎండు గడ్డి, ఆకులు, పీచు, చిన్నచిన్న పుల్లలతో చెట్ల తొర్రల్లో గూడు కడుతుంది. ఈ పక్షి **4-7** గ్రుడ్లు పెడుతుంది. ప్రతి సంవత్సరం అదే గూడులో గ్రుడ్లు పెడుతుంది.

# వంకాయ బుడత

ఈ పక్షి పసుపు రంగులో వంకాయపండు పోలి ఉంటుంది. గింజలు, కీటకాలు, పండ్లు తింటుంది.

ఈ పక్షి 4 గ్రుడ్లు పెడుతుంది. 5 సంవత్సరాలు జీవిస్తుంది.





## ఆకుపిట్ట

ఈ పక్షి ఆకుపచ్చని రంగులో ఆకు ఆకారంలో ఉన్న రెక్కలు కలిగి ఉంటుంది. ఇది చాలా చిన్న పక్షి. ఎక్కువగా నేల మీద తిరుగుతూ కదులుతూ ఉంటుంది.

ఈ పక్షి గూడు పొదల్లో కట్టుకుంటుంది. ఈ పక్షి **4** గ్రుడ్లు పెడుతుంది. ఇది ఒక సంవత్సరం కాలం మాత్రమే బ్రతుకుతుంది. ఈ పక్షులు కూడా మేము వేటాడతాము.

ఆకుపిట్ట వేట:

వేటగాడు ముళ్ళ పొదలకు దగ్గరగా చిన్న గుడిసె వేసుకొంటాడు. ఆ ముళ్ళ పొదపై పనస జిగురు పూస్తాడు. ఆ ముళ్ళ పొద నుండి సన్నటి తీగకు గడ్డి చుట్టి పక్షులకు కన్పించకుండా మరోవైపు పట్టుకుని ఉంటాడు. ఆ గడ్డి తీగ మధ్యలో చిన్న పక్షిపిల్లను గానీ, కోడిపిల్లనుగానీ వేలాడ కడతాడు.

ఆ పక్షిపిల్ల అరుపులు విని తల్లి పక్షులు, ఇతర పక్షులు అక్కడకు వచ్చి పొదలపై వాలినప్పుడు జిగురు అట్టుకొని ముళ్లపొదల్లో చిక్కుకొని కొట్టుకున్నప్పుడు పొంచి ఉన్నవాడు ఆ పిట్టలను వెంటిబద్దతో గురి చూసి కొడతాడు.

# వండ్రంగి పిట్ట

ఈ పక్షి నలుపు, ఎరుపు, పసుపు, మట్టి, తెలుపు రంగుల కలయికలతో అందంగా ఉంటుంది. దీని ముక్కు చాలా బలంగా అంపంలా ఉంటుంది. చెట్ల కాండంలో ఉన్న పురుగులు ముక్కుతో తొలచి తింటుంది. ఈ పక్షి చెట్ల తొర్రలో నివశిస్తుంది. **5 - 6** గ్రుడ్లు పెడుతుంది.





జగబందు : ఈ పిట్టలను కూడా మా పిల్లలు పట్టుకుంటారు.

టీచర్ : వేలా పట్టుకుంటారు.

జగబందు : వడ్రంగి పిట్టలు ఇంకా కొన్ని రకాల చెట్లతొర్రల్లో నివశించే పక్షులు ఉన్న ప్రాంతాలలో వాటి కదలికలను గమనించి, రాత్రి పక్షులు చెట్లుతొర్రల్లోకి వెళ్ళిన తరువాత నెమ్మదిగా వెళ్ళి పక్షులు ఉన్న చెట్లతొర్రలు(కన్నాలు) రాయితో పక్షులు రాకుండా మూసివేస్తారు. తరువాత రోజు ఉదయం పిల్లలు వెళ్ళి ఆ పక్షులను పట్టుకొని ఇంటికి తీసుకు వస్తారు.

వెంకట్ : నేను పురేడుపిట్ట కథ చెబుతాను టీచర్!

టీచర్ : సరే చెప్పు!

వెంకట్ : "పురిడి పిట్టల తగవులాట" కథ

ఒక పురిడి పిట్ట తన గూడును ఒక ముళ్ళపొదలో నేల మీద కట్టుకొని జీవించేది. తన చుట్టు ఉన్న మిగిలిన పక్షులతో స్నేహంగా ఉంటుండేది. ఇలా కొంత కాలం గడిచిపోయింది. కోతకాలం రానే వచ్చింది.

అది నవంబరు నెల వరిచేలు బాగా పండాయి. వరి గింజలంటే పురిడిపిట్టకు చాలా ఇష్టం. కానీ అవి తినాలంటే చాలా దూరం వెళ్లాలి. దూరమైనా పరవాలేదు మెల్లగా వెళ్ళి ఇష్టమైన వరి గింజలు తింటాననుకొని బయలుదేరింది. బాగా పండిన

వరి చేను దగ్గరకు వెళ్ళింది. కడుపు నిండా ధాన్యం తిన్నది. మళ్ళీ తన గూడుకి వెళ్ళి రావాలంటే చాలా దూరం కాబట్టి, పంట కోసే వరకు ఇక్కడే ఉండి రోజు మంచిగా గింజలు తినచ్చు అనుకొని అక్కడే ఉండిపోయింది.

కొద్ది కాలం తరువాత రైతు పంటను కోసుకొని ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు. పురిడిపిట్టకు అప్పుడు తన గూడు గుర్తుకుకొచ్చి అక్కడకు వచ్చింది. కానీ ఆ గూడులో మరో క్రొత్త పక్షిని చూసింది. పురిడిపిట్ట కట్టుకొన్న గూడును వేరొక పక్షి ఆక్రమించుకొంది. రెండు పక్షులు ఆ గూడు నాదంటే నాదని తగువులాడుకున్నాయి. తగువులాటకు మిగిలిన పక్షులన్నీ చోద్యం చూసాయి.

కానీ ఏపక్షి వాటి తగువును తీర్చలేక పోయాయి. ఇంక ఎవరు ఇక్కడ మన తగువు తీర్చలేరు. సరైనా న్యాయం చెప్పే వారిని వెతుక్కుంటూ వెళ్దాం పదా అని పురిడిపిట్ట చెప్పింది. పదా వెళ్దాం అని రెండు పక్షులు నడుచుకుంటు వెళ్తుంటే ఒక చెట్టు క్రింద గండుపిల్లి కన్పించింది. పక్షులను దూరంలో చూసిన గండుపిల్లి దేవునికి ప్రార్థిస్తున్నట్లు నటించింది. పక్షులు రెండు ఆ పిల్లిని చూసి చాలా తెలివైనదిలా కన్పిస్తుంది. పద అక్కడకు వెళ్ళి న్యాయం అడిగి తగువు తీర్చుకుందాం అని పురిడిపిట్ట చెప్పడంతో, రెండు పక్షులు పిల్లికి కొంచెం దూరంలో కూర్చొని తమ తగువు అంతా చెప్పాయి.

జిత్తులమారి ఆ గండుపిల్లి ఇలా అన్నది. " నేను ముసలి దాన్ని అవడం వలన చెవులు సరిగా వినిపించడం లేదు, కళ్ళు కనిపించడం లేదు, కాబట్టి కొంచెం నాకు దగ్గరగా వచ్చి చెవిలో చెప్పండి " అంటే రెండు పక్షులు పిల్లి శత్రువని ఆ సమయంలో మరచిపోయి గండుపిల్లి చెంత చేరాయి. అంతే ఆ గండుపిల్లి రెండు పక్షులను పట్టుకొని చంపుకు తినబోయింది.

పాపం పక్షులు రెండు అతి కష్టం మీద దాని నుండి తప్పించుకొని తమ గూడు వద్దకు పరిగెత్తాయి. అప్పుడు ఆ పక్షులు రెండు ఒక నిర్ణయానికి వచ్చాయి. మనలో మనకు తగువులొద్దు మనం ఇద్దరం కలిసివుంటే ఒకరికి ఒకరం తోడుగా ఉంటే ఎలాంటి శత్రువునైనా తప్పించుకోవచ్చు అనుకొని ఒక్క గూడులో రెండు పక్షులు కలిసి జీవించాయి.

టీచర్ : పిల్లలూ! చాలా చాలా బాగా చెప్పారు. మరీ ఇవే కాకుండా ఇంకా ఎవరైనా ఏమైనా పక్షుల్ని చూసారా? వాటి గురించి తెలుసునా?

విజయలక్ష్మి : నాక్కూడా కొన్ని పక్షులు గురించి తెలుసు. మా బుడ్డడు కూడా చెప్పాడు.

టీచర్ : మరీ అవేంటో కాస్త చెబుతావా తల్లి!

విజయలక్ష్మి : (కొన్ని పక్షుల గురించి చెబుతుంది)

# పురేడుపిట్ట

మట్టి, బూడిద, గోధుమ, ఎరుపు, నలుపు అన్ని రంగుల కలయికలతో ఉంటాయి. ఇది చాలా చిన్న పక్షి. నేలమీద, పొదలు మధ్య, రాళ్ళమధ్య చిన్నచిన్న గడ్డి, పీచులతో గూడు కట్టుకుంటుంది.

జూలై, ఆగష్టు నెలలో నాలుగు నుంచి ఆరు గ్రుడ్లు వరకు పెడుతుంది. సుమారు 20 రోజుల లోపు గ్రుడ్లను పొదిగి పిల్లలను పెడుతుంది. గింజలు, చిన్నచిన్న పురుగులను తింటుంది. సుమారుగా 2 సంవత్సరాలు బ్రతుకుతుంది. ఈ పక్షులు గుంపులు గుంపులుగా నేలపై తిరుగుతాయి. అడవిలో పోడులో కాల్చిన బుగ్గిలో సరదాగా ఆడుకుంటాయి. ఇసుక నేలలో గుంపులుగా పడుకుంటాయి.





# తేనెపిట్ట

ఈ పక్షి చాలా చిన్నదిగా ఉంటుంది. ఇది పొదలలో వాలి పురుగు గూడులతో గూడు కడుతుంది. ఇది 5 గ్రుడ్లు పెడుతుంది. దీని గ్రుడ్లు నీలం రంగు చుక్కలు కలిగి ఉంటాయి. పువ్వులలోని తేనె (మకరందం), పండ్లు, కీటకాలు తింటుంది. దీని ప్రత్యేకత దేనిమీద వాలకుండా ఆహారాన్ని సేకరిస్తుంది.



# కూకుడు గువ్వ

ఈ పిట్ట పేరు సవర భాషలో లబోతి అనగా మట్టిలో తవ్వి అందులో లోతుగా కన్నం చేసి లోపల గూడు కట్టుకొని గుడ్లు పెడుతుంది.

ఈ పిట్ట ఆహారం మిడతలు, చిన్నచిన్న కీటకాలు తింటుంది. ఈ పక్షి రెండు గ్రుడ్లు పెడుతుంది. దీని గ్రుడ్లు తెల్లగా ఉంటాయి.



## నల్లపిచ్చుక

ఈ పక్షి గట్లుపై కొంచెం ఖాళీసందులలో మరియు రాయిసందుల్లో, చెట్టు అడుగు భాగంలో, కొంచెం తొ(్రలు ఉన్నట్లయితే అందులో కూడ గూడు కట్టుకొని అందులో గుడ్లు పెడతాయి. ఈ పక్షి తెలుగులో నల్లపిచ్చుక అంటారు.

సవర భాషలో సోయ్‌సోయ్యాల్దా అంటారు. ఎందుకనగా ఈ పక్షి

నల్లగా ఉంటుంది. కాని మగపక్షి అయితే రెక్కలపై చివరి భాగం, తోక చివరి భాగంలో తెల్లగా ఉంటాయి. ఈ పక్షులు జంటలుగా ఉంటాయి. మగ పక్షి గూడు కట్టడం నుండి పిల్లలు పొదిగే వరకు ఆడపక్షికి తోడుగా ఉంటుంది.

ఈ పక్షులు రెండు చాలా సహాయంగా ఉంటాయి. మగ పక్షి ఒక రాయిమీద నిలబడి రెక్కలు ఎగరవేస్తు అటుఇటు చూస్తూ ఉంటాయి. ఎవరైనా వస్తారేమో అని ఆడపక్షికి కాపలా కాస్తూ మగపక్షి ఉంటుంది.

ఈ పక్షి సంవత్సరానికి ఒకసారి మాత్రమే గుడ్లు పెడతాయి. ఏప్రిల్, మే నెలలో అనగా బాగా ఎండలు కాసే టైమ్‌లో ఈ పక్షి గుడ్లు పెడతాయి. ఈ పక్షి చిన్నచిన్న కీటకాలు, మిడతలు, వానపాములు తింటాయి. ఈ పక్షి అరుపు చీబిజ్, చీబిజ్ అని అరుస్తుంది, ఈ నల్లపిచ్చుక నాలుగు లేక మూడు మాత్రమే గుడ్లు పెడతాయి. పొదిగే కాలం 20 నుండి 25 రోజులకి పిల్లలని చేస్తాయి.



# పాలపిట్ట

నీలం రంగులో పెద్ద తల, నల్ల ముక్కు, మట్టి రంగు కలిగి ఉంటుంది, తోక లేత నీలం రంగులో ఉంటుంది. ఈ పక్షి ఆహారం కీటకాలు, గింజలు, పురుగులు అన్ని తింటుంది.

పై నుండి ఆహారాన్ని చూసి ఏటవాలుగా, వేగంగా తిండిని అందుకుంటుంది. ఈ పక్షి 4-5 (మార్చి - జూలై) నెలలో గ్రుడ్లు పెడుతుంది. పెద్ద పెద్ద చెట్టు కన్నాలు, రాళ్ళ సందుల్లోను ఎండి గడ్డి, పిచ్చిపిచ్చి చెత్తతో, ఆకులుతో కడతాయి.

## బంగారు పాలపిట్ట కథ

అనగనగా ఒక అడవిలో కొన్ని పాలపిట్టలు జీవిస్తున్నాయి. అవి ఎంతో హయిగా ఆడుతూ పాడుతూ జీవనం సాగిస్తున్నాయి. దారి మధ్యలో ఒక పెద్ద చెట్టు ఉంది. ఒక గురువు ఎండలో ప్రయాణిస్తూ అలసి పోయి విశ్రాంతి తీసుకోవడానికి చెట్టు క్రింద కూర్చున్నాడు. ఆకలి భాదతో నీరసంగా చెట్టు మీదకు చూసాడు.

చెట్టు మీద కొన్ని పాలపిట్టలు గురువుని చూసి జాలిపడి అందులోని ఒక పాలపిట్ట పండ్లను కోసి గురువుకి ఇచ్చింది. ఆ పండ్లను తృప్తిగా తిని వెళ్ళేటప్పుడు నీకు ఏమైనా అవసరమైతే ఎప్పుడైన ఎక్కడైన నన్ను తలచుకో అని వరమిచ్చి వెళ్ళిపోయాడు.

ఒక రోజు ఆ పాలపిట్ట తన తోటి అన్ని పక్షులను చూసి వీటన్నింటి కంటే నేను ప్రత్యేకంగా కనిపించాలి అనుకొని నా శరీరంమంతా బంగారం రంగులోకి మారి పోవాలని గురువుని తలచుకుంది. వెంటనే ఆ పాలపిట్ట బంగారం రంగులోకి మారిపోయింది.

ఆ అడవి పక్కనే ఒక రాజ్యనికి ఒక రాజు ఉండేవాడు. ఒక రోజు వేట కోసం తన సైన్యంతో అడవికి బయలుదేరాడు. అడవిలోని జంతువులన్నింటికన్న ఈ బంగారు పాలపిట్ట రాజుగారికి ఎంతగాను నచ్చడంతో ఏలాగైన ఆ బంగారు పాలపిట్టను పట్టుకొని రావాలని ఆ సైన్యానికి ఆదేశించాడు. ఆ సైన్యం ఆ బంగారు పాలపిట్టను పట్టుకొని పంజరంలో బందించాడు. అడవిలో ఉండే స్వేచ్ఛను పంజరంలో ఉన్న తేడాను తెలుసుకున్న పాలపిట్ట బాధతో దు:ఖంతో కృంగిపోయి మరల గురువుని తలచుకుంది, వెంటనే ఆ పాలపిట్ట తన సహాజ రూపంలోకి మారిపోయింది.

అది గమనించిన రాజు పాలపిట్టను అసహ్యించుకుని వెంటనే వదిలేయమని భటులతో అన్నాడు. అప్పుడు ఎంచక్క అడవిలోకి వెళ్ళి పాలపిట్ట ఆనందంగా అడవికి వెళ్ళిపోయింది.



# నెమలి

మెరిసే అన్ని రంగుల కలయికతో ఇంద్ర ధనుస్సు రంగుల్లో చాలా అందంగా ఉంటుంది. దీని ఈకలు అందరికి ఇష్టం. చిన్న పిల్లలకు మరీ ఇష్టం. పెద్ద ఎత్తైన చెట్లపై ఉంటుంది.

చీపురు పొదల్లో, గడ్డిలో గ్రుడ్లు పెట్టి పొదుగుతుంది. రాత్రి సమయంలో చెట్లపై ఉంటుంది. దీని ఆహారం గింజలు, పురుగులు, అన్ని తింటుంది. ఆకాశం మేఘాలు కమ్మినప్పుడు ఆనందంగా పురి విప్పి నాట్యం చేస్తుంది.

టీచర్ : నెమలిని జాతీయ పక్షి అని కూడ అంటారు.

బాలమ్మ : నెమలి పాట పాడుతాను టీచర్!

టీచర్ : సరే పాడు, అందరం నేర్చుకుందాం.

బాలమ్మ : (పాట పాడుతుంది)

## నెమలిపై పాట

చీమ, నెమలి నేస్తం కట్టుకున్నాయి.

చీమ చచ్చింది, నెమలికి దు:ఖం వచ్చింది

నాయింటి కొచ్చేవే నేస్తామా ..... నేస్తామా .....

నువ్వేమి తిన్నావే నేస్తామా ..... నేస్తామా .....

నీ యింటి కొచ్చాను నేస్తామా ..... నేస్తామా .....

అన్నెం, పుణ్యం తిన్నాను నేస్తామా ..... నేస్తామా .....

( అని నెమలి ఏడుస్తుంది)

చీమ చచ్చింది, నెమలికి దు:ఖం వచ్చింది. కొర్రు మీద కాకికి కన్నోయింది.

తొగరి చెట్టు ఎండిపోయింది. గుర్రం గూనోయింది.


రాజుగారి కోడళ్ళ పిర్రులకి పీటలంటుకున్నాయి.

కుమ్మరి కుండలకావడి ఎత్తేసి, విడిళ్ళు అయిపోవాలి అంటాడు.

రంభ : నేను డేగ గురించి చెబుతాను టీచర్!

టీచర్ : అలాగే చెప్పమ్మ.

రంభ : (డేగ గురించి చెబుతుంది)



## డేగ

ఈ పక్షి రాగి, మట్టి, బూడిద రంగుల కలయికతో ఉంటుంది. పదునైన బలమైన ముక్కు ఉంటుంది. చురుకైన కళ్ళు ఉంటాయి. ఈ కళ్ళు ఎంత దూరంలో ఉన్నదాన్ని అయినా చూడగలవు. ఈ పక్షి ఆహారం చిన్నచిన్న పాములను, ఎలుకలను, కోడిపిల్లలను, పక్షుల్ని తింటుంది. దీని గూడు ఎత్తైనా, పొడవైన చెట్లపై గూడు కట్టుకుంటుంది. చిన్నచిన్న పుల్లలతో గూడు కట్టి 2-3 గ్రుడ్లు పెడుతుంది. ఇప్పుడు నేను డేగపై ఒక కథ కూడా చెబుతాను వినండి.

# మందుల డేగ కథ

అనగనగా ఒక ఊరిలో వేటగాడు ఉన్నాడు. అతను ఒకరోజు తన ఊరిలో ఉన్న అడవికి వేటకు వెళ్లాడు. వేటాడుతున్న సమయంలో అతనికి ఒక పక్షిగూడు కనిపించింది. దగ్గరకు వెళ్ళి చూసాడు. అది ఒక "డేగ" పక్షి గూడు ఆ గూడులో ఉన్న మూడు డేగ పిల్లలను తనతోపాటు తన ఇంటికి తీసుకొని వచ్చి, వాటిని హతమార్చి వాటి తలలను వేరుచేసాడు. ఆహారం కోసం వెళ్లిన "డేగ" తిరిగి తన గూడుకి వచ్చింది. తన పిల్లలు గూడులో లేకపోవడం చూసి, చాలా బాధపడింది. వెంటనే దేవుడైన హనుమంతుని దగ్గరకు వెళ్ళి తనకు జరిగిన సంఘటనను వివరించి, విల విలబోతుంది. దేవుడైన హనుమంతుడు తన వద్ద వున్న బంగారు వర్ణం గల అద్భుత శక్తి కల ఒక పుష్పాన్ని ఆ డేగకు ఇస్తాడు. డేగ ఆ పుష్పాన్ని తీసుకొని తన పిల్లలను వెదకడం ప్రారంభిస్తుంది. ఆ వేటగాడి ఇంట్లో తన పిల్లలు ఉన్నట్లు కనుక్కొని మిక్కిలి సంతోషించి ఆ పుష్పాన్ని తీసుకొని ప్రాణం కోల్పోయిన తన పిల్లల వద్దకు తీసుకొని మూడుసార్లు తల నుండి అరికాళ్ళ వరకు పువ్వుతో మంత్రిస్తుంది. వెంటనే చనిపోయిన ఆ డేగ పిల్లల బ్రతికాయి. డేగ చాలా సంతోషించి తన పిల్లలను తీసుకొని తన గూటికి తిరిగి ప్రయాణం అయింది.

కుమారి : టీచర్! టీచర్! నాక్కూడా కొన్ని ప్రత్యేకమైన గూడుకట్టుకొనే పక్షులు గురించి తెలుసు.

టీచర్ : ప్రత్యేకమైన గూళ్ళు కట్టే పక్షులు గురించి కూడా తెలుసుకుందామా పిల్లలూ!

పిల్లలూ : తెలుసుకుందాం. టీచర్! చెప్పమనండి.

టీచర్ : చెప్పమ్మా కుమారీ!

కుమారి : (పికిలిపిట్ట గురించి చెబుతుంది)



## పికిలపిట్ట

ఈ పక్షి చెట్లు కొమ్మలలో చిన్నచిన్న గడ్డి, పుల్లలతో కూడిన బుట్టలాంటి గూడును చక్కగా అల్లుకుంటుంది సంవత్సరానికి ఒక సారి మాత్రమే రెండు గ్రుడ్లు పెట్టి 20 నుంచి 27 రోజులలో పొదుగుతుంది. దీని గ్రుడ్లు గోధుమ రంగులో ఉంటాయి. గింజలు, కీటకాలను తింటుంది. ఈ పక్షులను కూడా వేటాడతారు.

### పికిలపిట్ట వేటాడే పద్ధతి :

చిన్న చిన్న పిట్టలను పట్టుకోవడానికి పనసచెట్టు బెరడు, పనస చెట్టు మొటిమ నుండి తీసిన జిగురును సేకరించి పక్షులను పట్టుకొనుటకు వాడతారు. పక్షులు ఎక్కువగా తిరిగే చెట్ల పైకొమ్మలకు పనస జిగురును పూసి దానిపై గింజలు జల్లుతారు. ఆ గింజలను తినడానికి వచ్చిన పక్షులు కొమ్మలపై జిగురుకు అతుక్కుపోయి ఎగరలేక ఉండిపోతాయి. దూరం నుండి గమనిస్తున్న పిల్లలు అక్కడకు వెళ్ళి పదునైన రాళ్ళతో గానీ, కేటల బారుతోగానీ, వెదురుతో చేసిన వెంటిబద్దకు రాళ్ళుపెట్టి గురి చూసి ఆ పిట్టలను కొడతారు. అవి కింద పడగానే తీసుకొని మంటపెట్టి కాల్చుకొని తింటారు.

# పొక్కుపిట్ట

పొక్కుపిట్ట ఆకుపచ్చ, పసుపు, నీలంరంగుల కలయికతో ఉంటుంది. ఇవి చెట్లపై గూడు చాలా అందంగా కడుతుంది. నాలుగు గ్రుడ్లు పెడుతుంది. ఎరుపు రంగులో ఉంటుంది. ఇది పొక్క్, పొక్క్ అని అరవడం వలన పొక్కుపిట్ట అని అంటారు. ఇది 6 సంవత్సరాలు బ్రతుకుతుంది. ఇది క్రిమి, కీటకాలు, పండ్లు, ఈగలు, దోమలను కూడా తింటుంది.

# చుట్టల పిట్ట

ఈ పక్షి పైన మట్టి రంగులో ఉండి రెక్కల దిగువన తెలుపు రంగులో ఉంటుంది. మూడు జాయింట్లుగా ఉన్న చెట్టుకొమ్మలో గూడు అల్లుతుంది. గ్రుడ్లు పొదిగే సమయంలో మాత్రమే గూడులో ఉంటుంది. తరువాత చెట్లు, పొదలలోని నివసిస్తుంది. 3 లేక 4 గ్రుడ్లు పెడుతుంది. పొదిగేకాలం 10 నుంచి 15 రోజులు. ఈ పక్షి ఆహారం చిన్నచిన్న కీటకాలు, పురుగులు, చీమలు, గింజలు మొదలగునవి తింటుంది. ఈ పక్షులు బియొబ్, బియొబ్ అని అరిస్తే వర్షాలు కురుస్తాయని మా ఊరు వారు అంటుంటారు.



# సాలెపిట్ట (సాలి పిచ్చుక)

ఇది చూడటానికి ఊర పిచ్చుకలా బూడిద, మట్టి రంగులో ఉంటుంది. క్రిమికీటకాలు, కప్పలు, గింజలు కూడా తింటుంది. ఈ పక్షి చెట్టు కొమ్మలకి వేలాడే విధంగా లోపల గదుల్లా చాలా ప్రత్యేకంగా పీచుతో గూడు అల్లుతుంది. ఇది చూసే వాళ్ళకి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. చిన్న చిన్న తాటి, వరి పీచుతో కడుతుంది. ఈ పక్షి **2-4** గ్రుడ్లు పెట్టి పిల్లల్ని చేస్తుంది. పిల్లల్ని ఎలుకల నుండి సంరక్షించు కుంటుంది. ఈ  పక్షులు కలిసి కట్టుగా ఒకే ప్రాంతంలో గూళ్ళు కట్టుకుంటాయి. చెట్లపై ఒక ఊరులా కనిపిస్తాయి.

## ఏట్రింజ (కత్తెరి పిట్ట)



ఈ పక్షి మెరిసే నలుపు రంగులో ఉంటుంది. దీని తోక కత్తెర వలే ఉంటుంది.

ఇది పురుగులు తింటుంది. పెద్ద చెట్లలో గూడు చక్కగా కడుతుంది. 3-5 గ్రుడ్లు పెడుతుంది.

టీచర్ : పిల్లలూ మీరందరు ఇప్పటి వరకు అన్ని పక్షులు గురించి చెప్పారు కదా! మరి నేను కూడా నాకు తెలిసిన పక్షుల గురించి చెప్పనా?

పిల్లలు : చెప్పండి టీచర్!

టీచర్ : ఇప్పటి వరకు మంచి మంచి గూడు కట్టుకొనే పక్షులు గురించి మీరు చెప్పారు. మరి గూడు కట్టకుండా, పిల్లలను పొదగకుండా ఉండే పక్షి ఏంటో తెలుసా?

పిల్లలు : తెలియదు టీచర్!

టీచర్ : ఆ పక్షి పేరు కోకిల. ఇది పై పక్షులకు భిన్నంగా ఉంటుంది.



# కోకిల

ఈ పక్షి నలుపు రంగు కలిగి ఉంటుంది. ముక్కు పసుపు రంగు, కాళ్ళు ఎరుపు రంగులో ఉంటాయి. 3 గ్రుడ్లు సంవత్సరానికి ఒక సారి పెడుతుంది. దీని ఆహారం కీటకాలు, పండ్లు, కాయలు మొదలగునవి తింటుంది.

ప్రత్యేకతలు : ఈ పక్షి తియ్యని గొంతుతో వసంతకాలంలో కూహూ కూహూ మని కూస్తుంది. ఇది వినేవాళ్ళకు అహ్లాదంగా ఉంటుంది. బాగా పాటలు పాడేవాళ్ళను కోకిలతో పోల్చుతారు. మరియు ఇది తన గ్రుడ్లలను కాకిగూడులో పెడుతుంది. కాకి పొదిగి పిల్లలను చేస్తుంది ఈ పక్షికి ప్రత్యేకమైన గూడు ఏమి ఉండదు. ఇది గూడు కట్టదు, పిల్లలను పొదగదు, పెంచదు.

# కాకిని పోలిఉన్న పక్షులు



## గీతపిట్ట

ఇది పొడవైన తోక కలిగి, మట్టి, తెలుపు బూడిద, నలుపు రంగులు కలిగి ఉంటుంది. చూడటానికి చాలా అందంగా ఉంటుంది. చెట్లు ఉన్నచోట రెండు, రెండు గానీ కుటుంబంలా కలిసి తిరుగుతాయి. దీని ఆహారం ఎలుకలు, కప్పలు, గింజలు పళ్ళు అన్ని తింటుంది. ఈ పక్షి ఫిబ్రవరి - జూలై నెలల్లో గూడు కట్టుకుంటుంది. మధ్య తరహా చెట్ల కొమ్మలో గూడు కడుతుంది. సాధారణంగా దీని గూడును గుర్తించలేము. **4-5** గ్రుడ్లు పెడుతుంది. బాధ్యతలు రెండు పంచుకుంటాయి.

# చమురు కాకి (చంబల్ బొాకి)

ఇది నలుపు, మట్టి రంగు కలసి అందంగా ఉంటుంది. ఈ పక్షి ఎన్ని గుడ్లు పెడుతుంది. ఎక్కడ గూడు కడుతుందో ఎవరికి తెలియదు. దీని మాంసం తింటే సర్వరోగాలు నయమవుతాయని నమ్మకం. ఈ పక్షి గూడు ఎవరికైనా ఒక వేళ కన్పించినా ఆ గూడు నీటిలో ఒక్కొక్క పుల్ల తీసి వదిలితే అందులో ఒక సంజీవిని పుల్ల ఉంటుందట. అది నీటిలో వదిలిన వెంటనే పాములా కన్పిస్తుందట. భయపడకుండా దాన్ని పట్టుకుంటే పులి అవుతుంది. అప్పుడు కూడ భయపడకుండా పట్టుకుంటే మరలా పుల్లలా మారిపోతుందట. అది ఆ వ్యక్తి తొడలో కోసి భద్రపరుస్తూ, ఆ వ్యక్తి ఎక్కడ ఉంటే అక్కడ శుభం కలుగుతుందట, చనిపోయే వారు కూడా బ్రతుకుతారని నమ్మకం. ఇది ఏప్పుడో వాళ్ళ పూర్వీకుల్లో జరిగింది. అంటుంటారు.

# ముగింపు

టీచర్ :

పిల్లలూ చూసారా ? మనం ఎన్ని పక్షుల గురించి మాట్లాడుకున్నామో! మనం పుట్టినప్పుడు నుండి ఎన్నో పక్షులను చూసి ఉంటాం. కాని వాటి పేర్లు, వివరాలు మనకు పూర్తిగా తెలియవు. కానీ ఇప్పుడు చూసారా బాలమిత్ర బడిలో చేరినాక రోజూ, అప్పుడప్పుడు మనం మనచుట్టూ ఉన్న పక్షుల గురించి పూర్తిగా తెలుసుకొని, మన పూర్వీకుల నుండి కూడా తెలుసుకొని, ఇక్కడ మీ అందరి అనుభవాలు ఒకరికి ఒకరు పంచుకోవడం వలన అందరికి అన్ని పక్షుల గురించి తెలిసింది కదా? అలాగే మీ నుండి మేము కూడా తెలుసుకొన్నాం. చాలా సంతోషం పిల్లలూ. మళ్ళీ రేపు తరగతి గదిలో మరిన్ని విషయాలు మాట్లాకుందాం.



బాలమిత్ర

Balamitra Model School
Plot No. 22, Eenadu Layout,
Sagarnagar, Visakhapatnam – 530043
Tel: 91-891-2737653, Fax: 91-891-2737662